# నిన్న తెలియని రేపు

**నా** జీవితంలో యెన్నో స్థలాలు చూశాను. ఎన్నో సంఘటనలలో చిక్కుకున్నాను.

మనసులో హత్తుకున్నవే. కొన్ని, కాలంతోపాటు తుడుచుకుపోయాయి. ఈ నాటికి యెక్కడున్నా, యే సమయంలోనైనా నేను మనసులోనుంచి తుడిచి పెట్టలేని ప్రదేశం ఒకటి, మరపురాని సంఘటనలు కొన్ని వున్నాయి. ఆ ప్రదేశం నా పుట్టుక స్థలం. ఆ సంఘటనలు నా చిన్ననాటివి.

ఉద్యోగరీత్యా దేశసంచారం చేసుకుంటూ ఏ ఐదేళ్ళకో, ఆరేళ్ళకో ఒకసారి స్వస్థలం వెళ్ళటం, నెలా, రెండు నెలలు గడపటం పరిపాటి, ఉన్న మా ఒక అబ్బాయి క్రిందటిసారి మా వూరు వెళ్ళేసరికి చిన్నవాడు. ఏవో చూపించి నేను గర్వంగా చెప్పుకున్నా ఆ రోజుల్లో వాడికి అర్థం కాలేదు. ఐదేళ్ళు దాటాక మళ్ళీ ఇంటికి ప్రయాణం. అచ్చంగా పీడి వయస్సులో ఉన్నప్పుడే నేను మా ఊళ్ళో మా యింటి గదిలో గతం చూచి గర్వపడ్డాను. ఈ గది మా ముత్తాత కట్టించాడు. మూడడుగుల వెడల్పు గోడలు. మిద్దె యిల్లు. టేకు దూలాలు. ఆ తలుపు, ఆ గుమ్మం అంతా నగిషీ పని. పైన రెండు వేపులా రెండు యేనుగు మూతి కొయ్యలపై ఒక బల్లచెక్క. ఆ చెక్క అంతా చెక్కడం పనే.

పద్మాలతో, సింహాలతో, చుట్టూ పూల అంచులతో ఎంతసేపు చూసినా తనివి తీరేదికాదు. వరండా మీద రెండూ ఒకేరకపు కర్రస్తంభాలు. అడుగునుంచి చివరివరకు శిల్పి వాటిలో లీనమై తన కళనంతా కరవు తీరేటట్లు తీర్చిదిద్దాడు. నా కంటికి అవి చిన్ననాడు, అమ్మలా కనిపించేవి. ఆ స్తంభాలను రెండు చేతులతో చుట్టుకుంటూ పైకి చూసేవాడిని. స్తంభం చివరలో అడ్డంగా కర్ర స్తంభాలపై అల్లుకున్న శిల్పశోభ ముగ్ధుణ్ణి చేసేది. యౌవనంలో యీ స్తంభాలు నిత్యం యౌవ్వనంతో అమరిన దేవకన్యల్లా అగుపించేవి. ఏ స్తంభం దగ్గర నిల్చొని గదిలోనికి చూసినా మధ్యనే గోడకు వ్రేలాడుతున్న రాధాకృష్ణుల విగ్రహం - తంజావూరు నాయక రాజుల సౌధంనించి ఈ గదిలోనికి చేరవేసిన దని, తరవాత నాకు సంశయం కలిగింది. ఈ రాధాకృష్ణులు లేత రంగుల్లో ఒళ్ళంతా కప్పుకునే ఉన్నారు. అద్దంమీద రంగులుపూసి వాటికి ప్రాణం పోశా డెవడో కళాకారుడు.

మా తాతయ్యకు దేవుళ్ళంటే యిష్టం. దేవుళ్ళ బొమ్మలు తప్పించి యింకోబొమ్మలు గదిలో వుండటానికి వీల్లేదు. ఒకనాడు నాలుగు పాత కిరసనాయిలు డబ్బాలు తెచ్చాడు. అవి బళ్ళపరపు చెయ్యడానికి నేనూ తాతయ్యకు వీధిలో యెండలో సహాయం చేశాను. మైదాపిండితో పేస్టు నేనూ కలిపాను. పాత టిన్ను రేకుల మీద దేవుళ్ళ బొమ్మలు నేనూ అంటించాను. నాలుగు గోడలకు నాలుగు అంటే, నాలుగునాళ్ళ పదహారు దేవుళ్ళబొమ్మలు గోడల మీద వెలిశాయి. కన్నెత్తి పైకిచూస్తే దూలాలకు మేకులు కొట్టి వ్రేలాడ తీసిన గాండీవం, ఖడ్గం, చక్రం, భీముని గద, దుర్యోధనుని గద....వీటి అవసరం గౌరీ పున్నమ రోజుల్లో వేసే వీధినాటకాల సమయంలో వచ్చేవి. విశేషం యేమంటే - మా నాన్న, తాత యిద్దరూ వేషాలు వేసేవారు. ఒకసారి విధిలేక మా తాత కృష్ణుని వేషంవేస్తే మా నాన్న అర్జునుని వేషం వెయ్యవలసివచ్చింది. “బావా” అనే బదులు “నాన్నా” అని పరాకుగా మా నాన్న మా తాతను సంబోధిస్తే, మా తాత చమత్కరించి సర్దుబాటు చేశారట.

మా తాతయ్య రోజూ మధ్యాహ్నం నిద్దర పోయేవారు. నిద్రపోయే ముందు చుట్టూ ప్రదక్షిణచేస్తూ అ దేవుళ్ళందరికీ మ్రొక్కేవారు. అ మంచం నాలుగు కోళ్ళూ యేనుగుకాళ్ళలా వుండేవి. అడుగునుంచి కోళ్ళ చివరవరకు అంతా నగిషీపనే. తల వేపు సింహాసనంకు వుండేటట్లు నగిషీ....మధ్యమధ్య చిన్న అద్దాలు. తాతయ్య నన్ను ప్రక్కనే వేసుకునేవారు. నిద్రపోయేముందు వీటన్నిటి వేపూ చూసుకుంటూ గడ పేవాడ్ని.

మా తాతయ్య గతించినా నేను యెప్పుడు వెళ్ళినా మా నాన్న అవేవి ముట్టకుండా అలానే వుంచడంచూచి గర్వపడేవాడ్ని. తాతయ్య గతానికి గర్వించి

నట్లే మా నాన్న గర్విస్తున్నట్లు తోచి మౌనంగా నా గర్వాన్ని నేను ద్విగుణీ కృతం చేసుకునే వాడిని. నా గర్వం నా తరవాతి తరంకి అందజెయ్యాలి. ఇది కష్టమైనపనే. ఎంచేతంటే - మా తాత, మా నాన్న, నేనూ - ముగ్గురం మా వూర్లోనే పుట్టాం. వాళ్ళిద్దరూ పెరిగిందీ, బ్రతికిందీ, బ్రతుకుతున్నదీ ఆ వూర్లోనే. నేనూ అక్కడే పుట్టి, తొమ్మిదేళ్ళవరకూ పెరిగి, చదువు వుద్యోగం రీత్యా దేశాటనం చేస్తూ అప్పుడప్పుడు మా వూరు వెళ్తున్నాను. నా కొడుకు బొంబాయిలో నేను ఉద్యోగం చేస్తున్నప్పుడు అక్కడ సెంట్ జార్జి ఆసుపత్రిలో పుట్టాడు. చదువు అ ఆలు బదులు ఎ బి సి డి లతో ఢిల్లీలో పూసారోడ్డులోని పబ్లిక్ స్కూలులో మొదలు పెట్టాడు. ఈ మొక్క వ్రేళ్ళు మా వూళ్ళో యెలా పాతుకుంటాయో నాకు అర్థంకాలేదు. ఇప్పుడు కాస్తో కూస్తో అర్థం చేసుకునే వయసు వచ్చింది కాబట్టి నాకు గుర్తున్న గతం వాడి పరంచేసి గర్వపడేటట్లు చెయ్యాలని ఆ మధ్య రోజూ నూరిపోస్తున్నాను. వీధి నాటకాలతో వాడి తాత, ముత్తాతలు గయుని రక్షించడానికి యెలా యుద్ధం చేశారో నటించి మరీ చెప్పాను. ఆ రెండు నగిషీ స్థంభాలను, ఆ రాధాకృష్ణుల బొమ్మను, ఆ మట్టి గోడలను, ఆ తలుపులనూ, గిలకల మంచాన్ని - అన్నీ వర్ణించి చెప్పాను. ఏ ఎర్రకోట చూడడానికో, ఆగ్రాకోట చూసేటప్పుడో, ఫతేపూర్ సిక్రిలో అక్బరు గురువు సమాధి చూసేటప్పుడో యీ పాలరాతి చెక్కడాలన్నీ తన తాత ముత్తాతలు నిర్మించిన ఆ ఒక్క గదికి సాటిరావని నూరిపోసేవాడ్ని. మా తాత, మా నాన్న, నా కొడుకు - వీళ్ళంతా నా వాళ్ళన్నట్లే - యీ గది నాది అనే గర్వం. నా అందం నాదీ, నా గుణం నాదీ అనుకోవటం వలన వచ్చిన గర్వం అది. ఎదుటివాళ్ళ అంద చందాలు, గుణగుణాలనుంచి తన తాత ముత్తాతల అందచందాలు, గుణగణాలవేపు కొడుకును త్రిప్పడానికి ప్రయత్నిస్తూ మా వూరు చేరుకున్నాను.

రెండు రోజుల రైలు ప్రయాణంతో మా వాడు యెన్నెన్నో ప్రశ్నలు వేశాడు. నా చిన్ననాడు పోల్చి చూడడానికి యేమీలేవు. వీడు దేశం తిరిగాడు. వివిధ రకాల మనుషుల్నేకాదు - వాళ్ళ గతాన్ని, వర్తమానాన్ని చూశాడు. ప్రకృతి అంద చందాల వైవిధ్యం వాడికి తెలుసు. ఒక దృశ్యాన్ని చూచి మనసులో నాలా దాచి పెట్టుకోడు, వర్ణిస్తాడు. లేదా అంటే కుంచె పట్టుకుని రంగులతో ఆ రూపాన్ని చిత్రించడానికి ప్రయత్నిస్తాడు. నేను ఆ చిన్నగది కిటికీ నించి లోకాన్ని చూడటానికి ప్రయత్నించాను. వాడు విశాల ప్రపంచంలోనించి ఆ కిటికీగుండా నా గతాన్ని పరీక్షగా చూడ కుతూహలపడుతున్నాడు.

నాకూ, నా కొడుక్కీవున్న బంధంలాంటిదే యేదో ఒకటి, గతంలో మనిషికి వుండాలి. భాషకూ, పరిసరాలకూ, బంధువర్గానికి దూరమైన మావాడు,

నే చెప్పిన విషయాలపై చూపిస్తున్న కుతూహలం బట్టి రక్తసంబంధాలు మనుషులను ముడివేస్తాయనిపించింది. ఆ ధైర్యంతోనే నేను మా వాడిని మా వూరు తీసుకు వెళ్తున్నాను.

ఇంటికి వెళ్ళేసరికి సాయంత్రమైంది. ఇంకా చీకటి పడలేదు. ఊరికి ఎలక్ట్రిక్ దీపాలు వచ్చాయి, మా యింటికీ వచ్చాయి. తాజమహల్‌కి ఎలక్ట్రిక్ దీపం వచ్చి దాని అందాన్ని పెంచలేదు. ఈ దీపం పెంచదనుకున్నాను. ఖిన్నుడనై గదంతా తిరిగి వరండామీద కూలబడిపోయాను. మావాడు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. నేను నూరిపోసినవన్నీ నాకే అప్పచెప్తున్నాడు. ఆ రెండు కర్ర స్థంబాల బదులు రెండు బోడి సిమ్మెంటు స్థంభాలున్నాయ్. ఇవి గట్టివట. లోన యినుప కడ్డీలున్నాయట. చెదతిన్న తలుపూ, ద్వారం, ఆపైన నగిషీబల్ల అంతా పొయ్యిలోనికి పోయాయట. ఆ అద్దంవాడే కొత్త ఫ్రేముతో యింకో రాధాకృష్ణుల బొమ్మ వ్రేలాడుతుంది. పచ్చి నైలాన్ చీరతో ఒళ్ళంతా చూపించుకుంటున్న రాధమ్మ, నీలి కృష్ణుణ్ణి నమిలి మ్రింగేస్తుంది.

ఇక ఆ పదహారు దేవుళ్ళ బొమ్మలు పెంటకుప్పమీద పడి కుళ్ళిపోయాయట. ఆ రేకులు తుప్పపట్టి కన్నాలయిపోయాయట. దేవుళ్ళకు బదులు గది నిండా గోడలకు అర్ధనగ్నంగా వున్న సినీ తారలు. అయ్యో! గచ్చుమీద గవ్వల పద్మమేదీ? బోడి బోడి మొసాయిక్ గచ్చు దాన్ని మింగేసిందా? ఆ ఏనుగులాంటి గిలకమంచం పీనుగులా వుంది నిర్దాక్షిణ్యంగా యే రంపం ఆ కాళ్ళను కోసిందో?

ఆ గదలూ, చక్రాలూ, గాండీవం.... స్థంభాలతోపాటు అగ్నిలో ఆహుతయ్యాయి.

"ఒక్క ఉత్తరంలోనైనా యిలా చేస్తున్నారని యెందుకు రాయలేద"ని నాన్నను అడిగాను.

"వాడి శెలవు అయిపోతుంది. పదిహేను రోజుల్లో అంతపనీ పూర్తిచేయించి వెళ్ళిపోయాడు. నువ్వు వస్తున్నావని తెలిసికూడా వుండలేకపోయాడు."

"ఎవడా వాడు?"

"ఇంకెవడురా? చిన్నవాడు!"

"చిన్నవాడైనా పెద్దపనే చేశాడు."

పొరుగు పెద్దమనిషి అన్నాడు: "మిలటరీ మనిషని పెంచుకున్నాడు. ఎంత గట్టి పనితనమో చూడు. పదిహేను రోజుల్లో పూర్తిచేయిస్తానన్నాడు. అలాగే చేసి తీరాడు. అదీ మొగతనం."

నేను జవాబు చెప్పకుండా అక్కడనుండి కదలిపోయాను నా కొడుకు నా వెంటపడ్డాడు. ఏవేవో ప్రశ్నలు వేస్తున్నాడు. నేను యీ బోడి గది చూస్తానికి

రాలేదు. ఈ మొసాయిక్ నేల, యీ సిమ్మెంటు స్థంభాలు, ప్లాటుఫారం లాంటి జీవంలేని యిల్లూ చూపించి నా కొడుకుని గతాన్ని చూసి ఉత్తేజితుని కమ్మని బోధించడానికి యింతదూరం రాలేదు. ఉద్యోగం చేస్తున్నప్పటినుంచీ, ఉత్తేజపరచలేని యెన్నెన్నో ఆఫీసు భవనాలను చూశాను. వెక్కిరించే యెన్నెన్నో బల్లలూ, కుర్చీలపై కూర్చున్నాను. అర్థం పర్థం లేని రూల్సుతో శరీరమంతా త్రాళ్ళతో కట్టించుకున్నాను. ఎదుటివాళ్ళ అవసరాలకు, ఆపదలకూ కరగకుండా నిర్లక్ష్యంగా మసలే జీవంలేని ఉద్యోగుల మధ్యలో చిక్కుకున్నాను.

ఈ ప్రాణంలేని నాకు కాస్తో కూస్తో గర్వాన్నిచ్చిందల్లా నా చిన్ననాటి తలపులే. నా గతం ప్రసాదించిన గర్వమే నన్నిలా యింకా మనిషిగా చెలామణీ చేయిస్తోంది. నా గతం నా కొడుక్కి అప్పచెప్పుదామని గంపెడాశతో వచ్చాను. వీడికివి చూపించకుండా వూహకు వదలాలి. ఊహించిన వాళ్ళను వూహకందని గతం ప్రత్యక్షంకాదు.

ఐనా, మావాడు కుతూహలంతో నన్ను ప్రశ్నిస్తూనే వున్నాడు. నేను మావూరు పరిసరాల్లో నాకు నచ్చినవేవో చూపిస్తున్నాను. ఇదిగో, యీ యేరు వంశధారానది - అంటే, యింతకంటే యెన్ని పెద్ద నదులను చూడలేదంటాడు. ఇదిగో యీ తోట - మా వాడు నవ్వాడు. వాడు అందమైన తోటలెన్నో చూశాడు. ఇవిగో పంట పొలాలు - నా వేపు వింతగా చూస్తున్నాడు. ఈ పరిసరాలకూ, వాడికీ పరిచయంలేదు. బంధంలేదు. తనను బహుశా బంధించగలిగేది, నాముందు తరాల వాళ్ళు సాధించిన ప్రగతి అది మంటగలిసిపోయింది. నాదీ అని నా కొడుకుకు చూపించడానికి యేదీలేదు. వాడికి గతం ప్రతిపాదించే గర్వం లేదు. వాడు అందుకే ఒక యంత్రంలా బ్రతుకుతాడు.

తిరిగి యింటి కొచ్చాను. ఆ ఆధునిక దేవతా విగ్రహాలను నా కొడుకు చూడకూడదు. గబగబ నా చేతినే బాణంలా సంధించి "అల్లుడా రమ్మని అదరంబున బిల్వ ...." అంటూ మా నాన్న పాడిన పద్యం వల్లించాను. కొడుకు ఒక్క ఎగురు ఎగిరాడు. పెద్ద నవ్వు నవ్వాడు. ఆ పద్యం పూర్తయింది. బాగా చీకటిపడింది. నా కళ్ళల్లో కదిలిన నీరు మావాడికి చూపించకుండా కదిలాను. *

(1973)